www.aksharadarbar.com
శుక్రవారం 28, జూన్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :125 | పేజీలు : 05 | వెల : 05

సీఎం వస్తున్నారు

- రెండు జిల్లాల్లో పర్యటన షెడ్యూల్ విడుదల
- నేరుగా మెగా టెక్స్ టైల్ పార్క్కు చేరుకోనున్న సీఎం
- ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్దకు
- అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్ చేరుకుని అభివృద్ధి పనులపై సమీక్ష

02

ఆదర్శప్రాయుడు పీవీ నరసింహారావు

వంగరలో జరిగిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

04

ఓవర్ కలెక్షన్!

- లారీల ద్వారా పాసింగ్ కంటే అదనంగా ఇసుక రవాణా
- తనిఖీలకు మార్గమధ్యంలో లారీలను ఆపుతున్న అధికారులు
- ఓవర్ లోడ్ పేరుతో కొందరు వే బ్రిడ్జిల వద్దకు తరలింపు
- అక్రమంగా ఇసుక ఉన్న లారీలను విడిచిపెట్టేందుకు డబ్బు డిమాండ్
- చివరకు ఒక్కో లారీ నుంచి రూ.2 వేలకు తగ్గకుండా కలెక్షన్
- రూరల్ లోనే కాదు చివరకు నగరంలోనూ వసూళ్ల దందా

02

ఇసుక అక్రమ రవాణాలో రవాణా శాఖలోని కొందరు అధికారులు వసూళ్లకు తెగబడుతున్నారు. ప్రధానంగా ఓవర్ లోడ్ ను క్యాష్ చేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో ఓవర్ లోడ్ ఇసుక లారీలను ఆపి భేరసారాలకు దిగుతున్నారు. తమను ప్రశ్నించిన వారి లారీలపై ఓవర్ లోడ్ కేసులు నమోదు చేస్తూ మిగతా లారీల నుంచి అందిన కాడికి డబ్బు గుంజుతున్నారు. ఓవర్ లోడ్ కలిగిన ఒక్కో లారీ నుంచి రూ.5 వేల చొప్పున డిమాండ్ చేసి చివరకు రూ.2 వేలకు తగ్గకుండా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం అక్రమ వసూళ్ల కోసమే అధికారులు కొందరు రోడ్లపై ఇసుక లారీలను ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జరుగుతున్న ఘటనల ద్వారా వెల్లడవుతుంది. ఆఖరుకు ఓవర్ లోడ్ లారీల ఓనర్లు వే బ్రిడ్జిల వద్ద ముడుపులను సమర్పించుకొని బయటపడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల కాలంగా ఈ అక్రమ వసూళ్ల దందా రోజురోజుకు పెరిగిపోతుంది.

- అక్షర దర్బార్, నిఘా విభాగం

గ్లాస్ పరిశ్రమలో పేలుడు

- ఆరుగురు మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

02

కుప్పకూలిన ఢిల్లీ విమానాశ్రయ రూఫ్

- ఒకరి మృతి
- తెల్లవారుజామున ఘటన
- పార్కింగ్ లేన్ లోని కార్లు నుజ్జునుజ్జు

04



రైతు బీమా కోసం

వ్యవసాయాధికారి కక్కుర్తి..!

- బాధిత కుటుంబాలను బాధిస్తున్న వ్యవసాయ శాఖ
- బీమా కావాలంటే రూ.30 నుండి రూ.50 వేలు కట్టాల్సిందే..
- వసూళ్ల కోసం గ్రామాల్లో ఏజెంట్లు
- ముక్కు పిండి వసూలు చేస్తున్న వైనం
- పలిమెల మండలంలో లక్షల్లో వసూలు
- చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల డిమాండ్

3 లో

అక్షర దర్బార్

in 2024 - Page 1

s://www.aksharadarbar.com/epaper/clip/2246

03

వ్యవసాయ విస్తీర్ణ అధికారిపై వేటు!

అక్షర దర్బార్ ఎఫెక్ట్

సస్పెన్షన్ కు సిఫారస్ విచారణకు ఆదేశాలు జారీ

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్

అక్షర దర్బార్ ఎఫెక్ట్

రైతు బీమా కోసం 'వ్యవసాయ శాఖ అధికారి కక్కుర్తి' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వ్యవసాయ శాఖ అధికారిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ వెంటనే చర్యలకు పూనుకున్నారు. పలిమెల మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి పృథ్వీరాజు సస్పెన్షన్ కు జిల్లా కలెక్టర్ కు, వ్యవసాయ శాఖ కమీషనర్ కు సిఫారసు చేసి ఎంక్వయిరీ కి ఆదేశించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ 'అక్షర దర్బార్' కు తెలిపారు. ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ పలిమేల మండలంలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ తెలిపారు. – అక్షర దర్బార్, మహాదేవపూర్

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

ఓవర్ కలెక్షన్!

- లారీల ద్వారా పాసింగ్ కంటే అదనంగా ఇసుక రవాణా
- తనిఖీలకు మార్గమధ్యలో లారీలను ఆపుతున్న అధికారులు
- ఓవర్ లోడ్ పేరుతో కొందరు వే బ్రిడ్జిల వద్దకు తరలింపు
- అక్రమంగా ఇసుక ఉన్న లారీలను విడిచిపెట్టేందుకు డబ్బు డిమాండ్
- చివరకు ఒక్కో లారీ నుంచి రూ.2 వేలకు తగ్గకుండా కలెక్షన్
- రూరల్ లోనే కాదు చివరకు నగరంలోనూ వసూళ్ల దందా

అక్షర దర్బార్, నిఘా విభాగం:

ఇసుక అక్రమ రవాణాలో రవాణా శాఖలోని కొందరు అధికారులు వసూళ్లకు తెగబడుతున్నారు. ప్రధానంగా ఓవర్ లోడ్ ను క్యాష్ చేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో ఓవర్ లోడ్ ఇసుక లారీలను ఆపి భేరసారాలకు దిగుతున్నారు. తమను ప్రశ్నించిన వారి లారీలపై ఓవర్ లోడ్ కేసులు నమోదు చేస్తూ మిగతా లారీల నుంచి అందిన కాడికి డబ్బు గుంజుతున్నారు. ఓవర్ లోడ్ కలిగిన ఒక్కో లారీ నుంచి రూ.5 వేల చొప్పున డిమాండ్ చేసి చివరకు రూ.2 వేలకు తగ్గకుండా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం అక్రమ వసూళ్ల కోసమే అధికారులు కొందరు రోడ్లపై ఇసుక లారీలను ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జరుగుతున్న ఘటనల ద్వారా వెల్లడవుతుంది. ఆఖరుకు ఓవర్ లోడ్ లారీల ఓనర్లు వే బ్రిడ్జిల వద్ద ముడుపులను సమర్పించుకొని బయటపడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల కాలంగా ఈ అక్రమ వసూళ్ల దందా రోజురోజుకు పెరిగిపోతుంది.

వసూళ్లకే ప్రాధాన్యం

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న జీరో, ఓవర్ లోడ్ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలని ఇటీవల రాష్ట్ర సర్కార్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇదే అదనగా సంబంధిత శాఖల అధికారులు కొందరు వసూళ్లకు బరితెగిస్తున్నారు. జీరో, ఓవర్ లోడ్ ఇసుక రవాణాను కంట్రోల్ చేయడానికి బదులు తమకు ఆదాయ వనరుగా మలుచుకుంటున్నారు. జీరో, ఓవర్ లోడ్ కు పాల్పడుతున్న ఇసుక లారీలపై కేసులు నమోదు చేయడం కంటే ఎక్కువగా తమ అక్రమార్జన కోసం వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అడపాదడప జీరో, ఓవర్ లోడ్ కేసులను నమోదు చేస్తూ 'ఓవర్' కలెక్షన్ తో అక్రమ ఆదాయాన్ని కూడబెట్టుకుంటున్నారు. రాష్ట్రంలో ఇసుక క్వారీలు ఉన్న ప్రాంతాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన భూపాలపల్లి, ములుగు జిల్లాలు ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ ప్రాంతంలో, ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లో గోదావరి ఒడ్డున ప్రభుత్వ ఇసుక క్వారీలు పనిచేస్తున్నాయి. ఈ క్వారీల నుంచి ప్రతిరోజు వందల సంఖ్యలో లారీలు ఇసుకను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తున్నాయి. కాళేశ్వరం నుంచి భూపాలపల్లి మీదుగా వరంగల్, ఏటూరునాగారం నుంచి ములుగు మీదుగా వరంగల్ చేరుకుంటున్న వందల ఇసుక లారీలు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతున్నాయి. ఈ క్రమంలో కాళేశ్వరం– వరంగల్, ఏటూరునాగారం– వరంగల్ రూట్లలోనే కాకుండా వరంగల్ నగరంలోనూ రవాణా శాఖ అధికారులు ఇసుక లారీల తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇసుక క్వారీల సమీపానికి సైతం వెళ్లి ఇసుక లోడుతో బయలుదేరిన లారీలను ఆపి తనిఖీ జరుపుతున్నారు. దీంతో జీరో, ఓవర్ లోడ్ ఇసుకతో బయలుదేరిన లారీలు తనిఖీల నుంచి తప్పించుకోలేని పరిస్థితి. ఈ క్రమంలో తాము ఆపుతున్న లారీల డ్రైవర్లతో కేసు నమోదు చేయమంటారా? తూకం వేసేందుకు వే బ్రిడ్జిల వద్దకు తరలించమంటారా? అని అధికారుల వెంట మనుషులు పేర్కొంటున్నారు. ఓవర్ లోడ్ ఉన్నందున ఒక్కో లారీకి రూ.5 వేల చొప్పున డిమాండ్ చేసి ఆ తర్వాత బేరం కుదిరాక రూ.2 వేల చొప్పున పుచ్చుకొని ఓవర్ లోడ్ లారీలను వదిలిపెడుతున్నట్లు ప్రచారంలో ఉంది. కొద్ది రోజుల క్రితం రవాణా శాఖలోని ఓ అధికారి మహాదేవపూర్ ప్రాంతంలో ఓవర్ లోడ్ ఇసుక లారీలను ఆపిన సమయంలో ఆయన డిమాండ్లను రికార్డు చేసిన ఆడియోలు తాజాగా ప్రభుత్వ నిఘా విభాగాలకు అందినట్లు తెలిసింది. సదరు అధికారి ఓవర్ లోడు కలిగి ఉన్న ఒక్కో లారీ నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేసినట్లు ఈ ఆడియోలో ఉందని సమాచారం. ప్రతిరోజు వివిధ మార్గాల్లో ఓవర్ లోడ్ ఇసుక లారీలను కొందరు అధికారులు మార్గమధ్యంలో ఆపటం, ఓవర్ లోడ్ కలిగి ఉన్న లారీలపై కేసు నమోదు చేయకుండా వసూళ్లకు పాల్పడుతుండటం వంటివి జరుగుతున్నట్లు సమాచారం.

వరంగల్ లో వే బ్రిడ్జి వద్ద..

వరంగల్ నగరంలో కూడా రవాణా శాఖ అధికారులు కొందరు ఓవర్ లోడ్ ఇసుక లారీల నుంచి వసూళ్లు చేయడం కొనసాగుతుంది. ఇసుక క్వారీల నుంచి ఓవర్ లోడుతో నగరానికి చేరిన లారీలను ఆపి వే బ్రిడ్జిల వద్దకు తరలిస్తున్నారు. చివరకు కేసు ఎందుకని వే బ్రిడ్జిల సాక్షిగా ఓవర్ లోడ్ కలిగి ఉన్న లారీలను ముడుపులు తీసుకొని పంపిస్తున్నారు. తాజాగా బుధవారం వరంగల్ లో ఏనుమాముల వద్ద గల వే బ్రిడ్జి వద్ద ఇదే జరిగినట్లు తెలిసింది. ఓవర్ లోడ్ ఉందని రవాణా శాఖలోని ఓ అధికారి ఇసుక లోడుతో ఉన్న మూడు లారీలను ఆపి ఆ వే బ్రిడ్జి వద్దకు తరలించారు. తీరా అక్కడికి వెళ్లాక ఓవర్ లోడ్ ఇసుక కలిగి ఉన్న ఒక్కో లారీ నుంచి రూ.2 వేల చొప్పున పుచ్చుకొని కేసు నమోదు చేయకుండానే మూడు లారీలను వదిలేసినట్లు సమాచారం. ఈ విషయం తాజాగా ప్రభుత్వ నిఘా వర్గాలకు అందగా ఓవర్ లోడ్ ఇసుక కలిగి ఉన్న ఆ మూడు లారీల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేసిన రవాణా శాఖలోని అధికారి ఎవరు?, అతనికి సహకరించింది ఎవరు? అనేది నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

గ్లాస్ పరిశ్రమలో

పేలుడు

- ఆరుగురు మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

అక్షర దర్బార్, రంగారెడ్డి: గ్యాస్ కంప్రెషర్ పేలి ఆరుగురు దుర్మరణం చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా షాద్నగర్లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. షాద్నగర్లోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో ఈ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా, 15 మంది కార్మికులకు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన కార్మికులను ఆసుపత్రికి తరలించారు. కంప్రెషర్ పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. పేలుడుతో పరిశ్రమలో భీతావహ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేశారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతులను బిహార్, యూపీ, ఒడిశా వాసులుగా గుర్తించారు. తీవ్ర గాయాలైనవారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. పేలుడు ధాటికి మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ ఇలాంటి ఘటన జరిగినప్పుడే కార్మికుల భద్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన సూచనల్ని ఏ మేరకు పాటించారనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

- ముఖ్యమంత్రి ఆరా

స్పందించిన ముఖ్యమంత్రి.. మరోవైపు షాద్నగర్ దుర్ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని కలెక్టర్కు ఆదేశాలు జారీచేశారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమల శాఖలు, వైద్య బృందాలు ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

- ఎక్స్ వేదికగా కేటీఆర్..

షాద్ నగర్ ప్రమాదంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. సౌత్ గ్లాస్ లిమిటెడ్ లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్ లో ప్రమాదాలు జరగకుండా రాష్ట్రప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతాల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, విపత్తు నిర్వహణ ప్రణాళికలు సమేక్షించాలని పేర్కొన్నారు. సౌత్ గ్లాస్ పరిశ్రమలో గ్యాస్ కంప్రెషర్ పేలుడు ఘటనపై రంగారెడ్డి జిల్లా కార్మిక సంఘాల నాయకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలో పీవీబీ ఆటోక్లేవ్ అనే గ్యాస్ కంప్రెషర్ పేలుడుతో ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో ఆరుగురు మరణించారని, గాయపడిన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

సీఎం వస్తున్నారు

- రెండు జిల్లాల్లో పర్యటన షెడ్యూల్ విడుదల
- ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్దకు
- నేరుగా మెగా టెక్స్ టైల్ పార్కుకు..
- అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష

అక్షర దర్బార్, హనుమకొండ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శుక్రవారం వాయిదా పడిన ముఖ్యమంత్రి పర్యటన శనివారం ఖారారైంది. శనివారం మధ్యాహ్నం 12:40 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒకటిన్నరకు గీసుకొండ మండలం శాయంపేట చింతలపల్లి వద్దగల కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. 20 నిమిషాల పాటు మెగా పార్కులో ఆయన పరిశ్రమల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తారు మధ్యాహ్న 2.10 గంటలకు వరంగల్ లో ప్రభుత్వం 24 అంతస్తులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్దకు చేరుకుంటారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి రెండున్నర గంటలకు హనుమకొండ కలెక్టరేట్ చేరుకుంటారు. మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన తర్వాత అక్కడే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5.40 గంటలకు హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ను ప్రారంభిస్తారు సాయంత్రం 6 10 గంటలకు మెడికవర్ హాస్పిటల్ నుంచి బయలుదేరి సాయంత్రం 6:30 గంటలకు ఆర్ట్స్ కాలేజ్ మైదానం చేరుకొని హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ తిరిగి వెళ్తారు

పీవీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రేవూరి

లక్నేపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ..

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఘనంగా పీవీ జయంతి వేడుకలు

అక్షర దర్బార్, పరకాల : తెలుగుజాతి ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు గొప్ప ఆర్థిక సంస్కర్త అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం పీవీ 103వ జయంతి సందర్భంగా పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ఆర్థిక పరిస్థితులు చక్కదిద్దిన మహానుభావుడు, 17 భాషల్లో ప్రావీణ్యం ఉన్నా మాతృభాష తెలుగు అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని కొనియాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు ఒంటేరు శ్రవణ్, ఎంపీటీసీ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, బ్లాక్ కాంగ్రెస్ వీర్ల చిన్ని, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గద్దం శివకుమార్, సీనియర్ నాయకులు కొలుగురి రాజేశ్వరరావు, చిన్నాల గోనాథ్, దాసరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

లక్నేపల్లిలో..

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లక్నేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐలోని అశోక్ ఆధ్వర్యంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్ కుమార్ పీవీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి పీవీ చేసిన సేవలు గుర్తు చేశారు.

'రైతుబీమా' వసూళ్లపై

విచారణ

- విచారణకు ఆదేశాలు జారీ చేసిన
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్
- వ్యవసాయ విస్తీర్ణ అధికారి సస్పెన్షన్ కు సిఫారస్
- అక్షర దర్బార్ ఎఫెక్ట్

అక్షర దర్బార్, మహాదేవపూర్ : 'రైతు బీమా కోసం వ్యవసాయ శాఖ అధికారి కక్కుర్తి' అనే శీర్షికతో శుక్రవారం అక్షర దర్బార్ లో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ వెంటనే చర్యలకు పూనుకున్నారు. పలిమెల మండల వ్యవసాయ విస్తరణాధికారి పృథ్వీరాజు సస్పెన్షన్ కు కలెక్టర్, వ్యవసాయ శాఖ కమిషనర్ కు సిఫారసు చేసి విచారణకు ఆదేశించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ 'అక్షర దర్బార్' కు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి మహేష్ పలిమేల మండలంలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

ఇంటెలిజెన్స్ ఆరా

పలిమెల మండలంలో అవినీతి అధికారులపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మారుమూల అటవీ ప్రాంతం అమాయక రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులపై ఇంటెలిజెన్స్ అధికారులు సైతం విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

రైతు బీమా కోసం వ్యవసాయాధికారి కక్కుర్తి..!

- బాధిత కుటుంబాలను బాధిస్తున్న వ్యవసాయ శాఖ
- బీమా కావాలంటే రూ.30 నుండి రూ.50 వేలు కట్టాల్సిందే..
- వసూళ్ల కోసం గ్రామాల్లో ఏజెంట్లు
- ముక్కు పిండి వసూలు చేస్తున్న వైనం
- పలిమెల మండలంలో లక్షల్లో వసూలు
- చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల డిమాండ్

ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత రైతు కుటుంబం

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మారుమూల అటవీ మండలమైన పలిమెల మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రమాదవశాత్తు రైతులు మృతి చెందితే వచ్చే రైతు బీమా డబ్బుల మంజూరుకు రూ.30 నుండి రూ.50 వేల వరకు ముట్టజెప్పితేనే బీమా డబ్బులు వచ్చేలా చూస్తామని బాధిత కుటుంబాలను పీడించి వసూలు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పలిమెల మండల వ్యాప్తంగా గ్రామాల్లో కొంతమంది ఏజెంట్లను పెట్టుకొని బాధితుల వద్ద డబ్బులు వసూలు చేసి తనకేమీ తెలియదు అన్నట్లు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. నీలంపల్లి గ్రామానికి చెందిన వాసం పద్మ అనే మహిళా రైతు గత కొద్ది రోజుల క్రితం పిడుగుపాటుకు గురై మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు సాక్షాత్తు ఎంపీపీ బుజ్జక్క, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతయ్య వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు.. అసలే తాము పేద కుటుంబీకులమని మా వద్ద డబ్బులు లేవని అధికారికి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతోందని.. తమరైనా కాస్త వ్యవసాయ శాఖ అధికారికి చెప్పి రైతు బీమా డబ్బులు వచ్చేలా చూడాలని వాపోయారు. గతంలో సైతం ఈ అధికారి బాధిత రైతు కుటుంబాల వద్ద భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసలే మారుమూల అటవీ గ్రామాల్లో రెక్కాడితే కానీ డొక్కాడని రైతు కుటుంబాలు ఈ అధికారి వసూళ్ల తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేద బాధిత కుటుంబాల రైతులను పీడిస్తున్న ఈ అధికారిపై ఉన్నతాధికారులు ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ ఏవో కు వివరణ కోసం ఫోను చేయగా ఫోను లిఫ్ట్ చేయలేదు కాగా ఏఈఓ పృథ్వీరాజ్ ను వివరణ కోరగా తాను ఎవరి వద్ద వసూలు చేయలేదని చెప్పడం గమనార్హం.

అక్షర దర్బార్
27 Jun 2024 - Page 3
https://www.aksharadarbar.com/epaper/clip/2251

అక్షర దర్బార్ లో ప్రచురితమైన కథనం..

కస్తూర్బాలో విద్యార్థినులకు

బుక్స్, యూనిఫాం పంపిణీ

అక్షర దర్బార్, సంగెం : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, యూనిఫాంలను ఎంపీపీ కందగట్ల కళావతి శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కళావతి మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కె. నీలిమ, ఎంపీటీసీ మెట్టిపల్లి మల్లయ్య, ఏపీఎం కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు టెక్స్ట్ బుక్స్, యూనిఫాం అందస్తున్న ఎంపీపీ కళావతి

ఫ్లోర్ లీడర్ కు

తక్కళ్లపల్లి పరామర్శ

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు శుక్రవారం పరామర్శించారు. హనుమకొండలోని ముత్యం కిడ్నీ హాస్పిటల్లో గత నాలుగు రోజుల క్రితం కిడ్నీ స్టోన్స్ ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి రవీందర్ రావు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, చీకటి స్వరూప ఓదెలు, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగంగౌడ్, సహాయ కార్యదర్శి నాంపెల్లి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ యూఐ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్ కుమార్, దండెం రతన్ కుమార్, ఓబీసీ నాయకులు ఉన్నారు.

సాంబయ్యను పరామర్శిస్తున్న రవీందర్ రావు

జార్ఖండ్ మాజీ సీఎంకు ఊరట

- సోరెన్ కు హైకోర్టు బెయిల్

అక్షర దర్బార్, రాంచీ: భూకుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాంచీలోని సోరెన్ నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. సోరెన్ అభిమానులు ఆయన నివాసం వద్ద స్వీట్లు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు భారీ ఊరట లభించింది. భూ కుంభకోణం కేసులో అరెస్టయిన ఆయనకు జార్ఖండ్ హైకోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. దీంతో రాంచీలోని బిర్సా ముండా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయన హైకోర్టు తీర్పుతో ఐదు నెలల తర్వాత జైలు నుంచి బయటకు రానున్నారు.

'ప్రైవేట్' అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పేరుతో లక్షల్లో వసూలు చేస్తున్న ప్రవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల పర్మిషన్ రద్దు చేయాలని, బుక్ సెంటర్లలో పాఠశాల పేరు చెప్పి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, నాయకులు బొజ్జ హేమంత్, కోకిల ప్రేమ్, సాయి తేజ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేస్తున్న నాయకులు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై

సీఎంతో ప్రకటన చేయిస్తాం

- ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు
- ఎమ్మెల్యేలను కలిసిన సిక్స్ మెన్ కమిటీ

అక్షర దర్బార్, వరంగల్: సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ప్రెస్ క్లబ్ సిక్స్ మెన్ కమిటీ శుక్రవారం కలిసింది. రెండు జర్నలిస్టు సొసైటీల స్థలాలు క్లియర్ చేయటంతో పాటు, ఏ సొసైటీలో లేని వర్కింగ్ జర్నలిస్టుల కోసం అనువైన స్థలం కేటాయించాలని కోరింది. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలు సీఎంతో స్పష్టమైన ప్రకటన చేయిస్తామని హామీ ఇచ్చారు. భూకేటాయింపులకు సంబందించి సీఎంతో అధికారులకు ఆదేశాలు జారీ చేయిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో సిక్స్ మెన్ కమిటీ కన్వీనర్ బీఆర్ లెనిన్, కో-కన్వీనర్లు వేముల నాగరాజు, బొక్క దయాసాగర్, సభ్యులు, గద్దం రాజిరెడ్డి, మస్కపురి సుధాకర్, బొల్లారం సదయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన సిక్స్ మెన్ కమిటీ సభ్యులు

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

దేశానికి దిశా నిర్దేశం చేసిన పీవీ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- డీసీసీ భవన్ లో ఘనంగా పీవీ జయంతి వేడుకలు

అక్షర దర్బార్, హనుమకొండ: ఆర్థిక సంస్కరణలతో దేశానికి దిశానిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి, బహుముఖ ఆర్థికవేత్త, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఆయన చిత్ర పటానికి, హనుమకొండ బస్టాండ్ కూడలిలో ఉన్న కాంస్య పీవీ విగ్రహానికి ఎమ్మెల్యే నాయిని పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అనర్గళంగా 17 భాషలు మాట్లాడగలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి బహుబాషా కోవిదుడు పీవీ అన్నారు. ఆర్థశాస్త్రం, చరిత్ర, చట్టం, రాజకీయాలు, కళలు వంటి రంగాల్లో పట్టున్న వ్యక్తి పీవీ. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ 4 వ ముఖ్యమంత్రిగా విశేష సేవలందించిన తెలంగాణా ముద్దుబిడ్డ అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 1972లో భూసంస్కరణలు చేపట్టి భూస్వామ్య వ్యవస్థను రూపుమాపారని, దున్నేవాడికే భూమి అని పిలుపునిచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆయన హయాంలోనే దేశంలోనే మొదటిసారి పేద విద్యార్థులకు రెసిడెన్షియల్ విద్య ప్రారంభమైందని నాయిని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ రావు, టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, బంక సరళ, రాం ప్రసాద్, గుంటి స్వప్న, తాళ్లపల్లి మేరీ, బండారి జనార్ధన్, నల్ల సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ ఏ నాగరాజు, గాండ్ల స్రవంతి, జాఫర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మం డల సమ్మయ్య, కొన శ్రీకర్, బంక సతీష్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎమ్మెల్యే యాదయ్యకు కండువా కప్పుతున్న సీఎం రేవంత్

బీఆర్ఎస్ కు మరో షాక్

- కాంగ్రెస్ లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీలో 72 కు చేరిన కాంగ్రెస్ బలం

అక్షర దర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్కు మరో షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు రోజు రోజుకీ జోరందుకుంటున్నాయి. తాజాగా బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఇప్పటివరకు ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఫలితంగా కాంగ్రెస్కు ఇప్పటివరకు ఉన్న 65 సభ్యుల బలం సీపీఐతో కలిపి 66కు చేరుకుంది. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరుగురు చేరడంతో కాంగ్రెస్ పార్టీకి 72కి సభ్యుల బలం పెరిగింది. దీంతో శాసనసభలో బీఆర్ఎస్కు 32 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎం పార్టీకి 7 మంది ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు. ముందుగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రెండు నెలల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ తర్వాత భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్లో సీనియర్ నేత స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని, వరంగల్ ఎంపీగా తన కుమార్తె కడియం కావ్యకు టికెట్ ఇప్పించుకుని గెలిపించుకున్నారు. బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరేది నెక్స్ట్ ఎవరు అనేది ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయమైంది.

కవితతో హరీష్ రావు ములాఖాత్

అక్షర దర్బార్, న్యూఢిల్లీ : తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ములాఖాత్ అయ్యారు.

ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు జూన్ 21న ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరు పరిచారు. ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనున్నది. కాగా కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

ఆదర్శప్రాయుడు పీవీ నరసింహారావు

వంగరలో జరిగిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

అక్షర దర్బార్, బీమదేవరపల్లి: ఆదర్శప్రాయుడు భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పీవీ 103వ జయంతి వేడుకలు భీమదేవరపల్లి మండలం వంగరలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై వంగర గ్రామంలోని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య , ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పీవీ కుటుంబ సభ్యులు, వంగర గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టి అభివృద్ధి వైపు తీసుకెళ్లిన గొప్ప నాయకుడు పీవీ అని కొనియాడారు. వంగరలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సీపీని కలిసిన వెస్ట్ జోన్ డీసీపీ

అక్షర దర్బార్, హనుమకొండ: వరంగల్ కమిషనరేట్ వెస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన రాజ మహేంద్ర నాయక్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మార్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు వెస్ట్ జోన్ పరిధిలో శాంతి భద్రతలు, ఇతర విషయాలపై చర్చించుకున్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- 73 శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణ త
- అబ్బాయిల ఉత్తీర్ణత 71.01 శాతం
- అమ్మాయిల ఉత్తీర్ణత 76.37 శాతం

అక్షర దర్బార్, హైదరాబాద్:తెలంగాణ పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. మధ్యాహ్నం 3 గంటలకు విద్యాశాఖ అధికారులు వీటిని విడుదల చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 73 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అబ్బాయిల ఉత్తీర్ణత 71.01 శాతం కాగా, అమ్మాయిల ఉత్తీర్ణత 76.37 శాతంగా నమోదైంది. అధికారిక వెబ్‌సైట్ https://bse.telangana.gov.in/లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నెంబరు నమోదుచేసి ఫలితాలు చూసుకోవచ్చు. ఇక జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 51,237 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కుప్పకూలిన ఢిల్లీ ఎయిర్ పోర్ట్ రూఫ్

- ఒకరి మృతి
- తెల్లవారుజామున ఘటన

అక్షరబర్బార్, ఢిల్లీ: ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం టెర్మినల్-1డి పైకప్పు కూలిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటనతో చెక్ ఇన్ కౌంటర్లను మూసివేశారు. విమానాశ్రయం చుట్టూ పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అలాగే, అక్కడి నుంచి వెళ్లాల్సిన విమానాలను మధ్యాహ్నం ఒంటి గంట వరకు రద్దు చేశారు. రూఫ్ షీట్‌తోపాటు దానికి సపోర్టింగ్‌గా ఉన్న పిల్లర్లు ఈ తెల్లవారుజామున కుప్పకూలాయి. దీంతో డిపార్చర్ లైన్ వద్ద పార్క్ చేసిన కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనను తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్టు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. గురువారం రాత్రి నుంచి ఈ ఉదయం వరకు ఏకధాటిగా కురిసిన వానలతో ఢిల్లీ రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

ధ్వంసమైన కార్లు

'ఉపాధి' డబ్బుల జాడేది?

- నెలలు గడుస్తున్నా ఖాతాలో పడని కూలి
- పట్టించుకోని అధికారులు

అక్షర దర్బార్, మల్హార్ : నెలలు గడుస్తున్నా ఉపాధి పథకం డబ్బులు ఖాతాలో పడడం లేదని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఎండాకాలంలో తీవ్ర ఎండలు సైతం లెక్కచేయకుండా ఉపాధి పనులు చేస్తే.. తమ కూలీ డబ్బులు ఇంకా అందడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అట్టడుగు వర్గాలను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకాన్ని తీసుకువస్తే కింది స్థాయి అధికారులకు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కూలీలు మండిపడుతున్నారు. ఉపాధి డబ్బులు త్వరగా ఇప్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బాధిత కుటుబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ..

అక్షర దర్బార్ సంగెం : సంగెం మండలం గవిచెర్ల, ఎల్గూర్ స్టేషన్, ఎల్గూర్ రంగంపేట గ్రామాల్లో ఇటీవలే వివిధ కారణాలతో మృతి చెందిన గుళ్లపల్లి సాయిలు, గుళ్లపల్లి కుమార్, బొల్ల కుమార్, బోనాల కృష్ణమూర్తి, ఆశ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. చల్లా వెంట నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, పసునూరి సారంగపాణి, దొనికల రమ– శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వరంగల్ కవాత్ ను విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు సురేష్

అక్షర దర్బార్, మహాదేవపూర్ : జూలై 7న వరంగల్ లో జరిగే మాదిగల కవాత్ ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ కోరారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ అంగరంగ వైభవంగా జరిగే కవాతులో మాదిగ, మాదిగ ఉప కులాలు భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ తుడిచర్ల దుర్గయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మంథని రవితేజ, నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రిని కలిసిన డ్రామాటిక్ అసోసియేషన్

అక్షర దర్బార్, హనుమకొండ: వరంగల్ నగరంలో హనుమకొండ వద్ద నిర్మిస్తున్న కాళోజి కళాక్షేత్రం వేదికను నాటకాల ప్రదర్శనకు అనువుగా నిర్మించాలని తెలంగాణ డ్రామటిక్ అసోసియేషన్ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖను కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సదానందం, ఉపాధ్యక్షుడు బాలాజీ నేతృత్వంలోని బృందం శుక్రవారం మంత్రిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అదే విధంగా కాకతీయుల వైభవాన్ని తెలంగాణ వ్యాప్తంగా చాటేందుకు అవసరమైన అనుమతులు లభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ డ్రామటిక్ అసోసియేషన్ వినతుల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.

నలుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతి

అక్షర దర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు కుమారస్వామి, యాకాంబరం, రాంప్రసాద్, రాజేష్ లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం రాత్రి ఉత్తర్వులు జారిచేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్ల భుజాలపై హెడ్ కానిస్టేబుల్ పట్టీలను అలంకరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు పెరుగుతాయని, నిరంతరం బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

ఎస్పీని కలిసిని పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు

ఇసుక క్వారీలను సందర్శించిన భూపాలపల్లి ఎస్పీ

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలను భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్వారీ యజమానులు, లారీ డ్రైవర్లతో ఎస్పీ మాట్లాడుతూ పరిమితికి మించి ఇసుకను తరలించరాదని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లు సైతం వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఎస్పీ వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్ రావు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే

కాళేశ్వరం ఎస్సై చక్రపాణి

అక్షర దర్బార్,మహాదేవపూర్ : ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితులకు మాత్రమే వర్తిస్తుందని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కాళేశ్వరంలో మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్, కాళేశ్వరం ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చక్రపాణి మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితుల వరకే వర్తిస్తుందని, దానిని ఆసరాగా తీసుకొని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సాయం చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి బండి నడిపినా, బహిరంగంగా మద్యం సేవించినా, గాంజా, గుడుంబాలకు అలవాటు పడినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, ఈవ్ టీజింగుకు పాల్పడినా, మహిళలపై, చిన్న పిల్లలపై దౌర్జన్యాలకు పాల్పడినా, రాత్రి సమయంలో రోడ్లపై తిరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇచ్చి నడిపిస్తే తల్లి దండ్రులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎంజీపీ ప్రిన్సిపాల్ గా ఓదెల మల్లయ్య బాధ్యతలు..

అక్షర దర్బార్, దుగ్గొండి: గిర్నిబావిలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల నూతన ప్రిన్సిపాల్ గా ఓదెల మల్లయ్య శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో కమలాపురం బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా సేవలందించి మల్లయ్య గ్రేడ్ వన్ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కూరోజు దేవేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

మహాదేవపూర్ తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్

అక్షర దర్బార్, మహాదేవపూర్ : భూ సంబంధిత సమస్యలపై ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహాదేవపూర్ తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల 30 నిమిషముల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన తెలియజేశారు.